క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


కార్తీక్

వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్ గ్రామానికి చెందిన కమటం కార్తీక్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ కుమార్ గురువారం తెలిపారు. ఈనెల 7వరకు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సిరిసిల్ల జట్టు తరఫున ఆడనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు కార్తీక్‌ను అభినందించారు.


హర్షవర్ధన్

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన రాగిరి హర్షవర్ధన్ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు గ్రామ ఈతరం క్లబ్ యూత్ అధ్యక్షుడు నరేశ్ గురువారం తెలిపారు. కార్యదర్శి సాయి గణేశ్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంద్ర నారాయణ, ఉపాధ్యక్షుడు సంతోష్, భట్టు విజయ్, తదితరులున్నారు.

ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గొంగ్ల ఉమాశంకర్, శివాచార్య ఆధ్వర్యంలో గణపతిపూజ, అష్టదిక్పలక, గౌరీపూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంప నాగేంద్రం- పద్మ దంపతులు, బొందుగుల మార్కండేయ, నవ్వోతు రాము, వనం రమేశ్, సిద్ధిరాములు, పారిపల్లి రాంరెడ్డి, రేవూరి లక్ష్మీనారాయణ, చెన్న సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో మల్లికార్జున స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విగ్రహాల ఊరేగింపు, గణపతి హోమం నిర్వహించారు. పుణ్యాహవచనం, నవగ్రహ, అష్టదిక్పాలన చేశారు. కలశ స్థాపన చేపట్టి తొలిరోజు ఉత్సవాలు నిర్వహించారు. ఆవునూర్, తుర్కపల్లి, రామలక్ష్మణపల్లె గ్రామస్తులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గిరిజన యువతికి ప్రభుత్వ ఉద్యోగం



వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్ తండాకు చెందిన భట్టు లలిత గురుకుల పాఠశాలలో సంగీత ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. మారుమూల తండాలో ఉంటున్న లలితకు ఆరుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. చిన్నప్పటి నుంచి చదువంటే మక్కువ. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదివి, సంగీతంలో రాణించాలని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో డిగ్రీ, పీజీ పూర్తిచేసింది. మరిమడ్ల ఈఎంఆర్‌ఎస్‌లో ఔట్ సోర్సింగ్‌గా ఏడాది పాటు పనిచేసింది. ఔట్ సోర్సింగ్ వారిని విధుల నుంచి తొలగించడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకుంది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్‌లో సంగీత ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. దోమకొండలోని సోషల్ వెల్ఫేర్‌లో ఉపాధ్యాయురాలిగా చేరింది. దీంతో గ్రామస్తులు లలితను అభినందించారు.

ఓటర్ జాబితాపై సమావేశం


సమావేశమైన అధికారులు

ఎల్లారెడ్డిపేట: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం తాత్కాలికంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయగా, జాబితాపై గురువారం అధికారులు సమీక్ష నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ తాజాగా పంచాయతీ వార్డుల వారీగా ఈనెల 6 వరకు తయారు చేసిన తుది ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై అతికించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, ఎంపీవో జోగం రాజు, నాయకులు నంది కిషన్, అధికారులున్నారు.

ఆహ్లాదానికి దూరం..



చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామంలో ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం గేటుకు తాళం వేశారు. పల్లె ప్రజలకు ఆహ్లాదభరిత వాతావరణాన్ని కల్పించాలని గత ప్రభుత్వం రూ.లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం గేటు తాళం వేయడంతో గ్రామస్తుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు తాళం తీసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి


కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడఅర్బన్: న్యాయవాదుల రక్షణ కల్పించాలని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం అన్నారు. వరంగల్ జిల్లా కోర్టులో గంధం శివ అనే న్యాయవాదిపై పోలీసులు దాడి చేసిన ఘటన నిరసిస్తూ వేములవాడ కోర్టులో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం పోలీసులకు పరిపాటిగా మారిందన్నారు. వరంగల్‌లో న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజినికాంత్, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, రేగుల దేవేందర్, విద్యాసాగర్ రావు, సుధాకర్‌రెడ్డి, పొత్తూరు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రశ్నిస్తా.. పరిష్కరిస్తా


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

సిరిసిల్లకల్చరల్: అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ బరిలోకి దిగిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డి గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో పలువురితో భేటీ అయ్యారు. ప్రభుత్వ కళాశాల మైదానం, బతుకమ్మ ఘాట్, ఇందిరా పార్క్, మినీ స్టేడియం తదితర ప్రాంతాల్లో వాకర్స్‌తో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యావంతుల సంక్షేమం కోసం వారి తరఫున సమస్యలను మండలిలో ప్రశ్నిస్తూనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే మండలి ఎన్నికల్లో పట్టభద్రుల తరఫున ప్రతినిధిగా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సీనియర్ నాయకుడు గడ్డం నర్సయ్య, పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ వెల్ఫేర్ బోర్డు నిధులు కాపాడాలి



మాట్లాడుతున్న శ్రీధర్

బోయినపల్లి: భవన నిర్మాణ కార్మికులు లేబర్ వెల్ఫేర్ బోర్డు నిధులను కాపాడేందుకు కృషిచేయాలని సీఐటీయూ భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్మికులతో కలిసి గురువారం మాట్లాడారు. లేబర్ కార్డు కార్మికులకు వైద్యపరీక్షల పేరిట లేబర్ వెల్ఫేర్ నిధులు దుర్వినియోగం చేసే వారి ఎత్తుగడలను నమ్మవద్దన్నారు. ఆయన వెంట కార్మికులు బొజ్జ శ్రీను, గుంటి రాజు, ఎడపెల్లి శ్రీను, బొడ్డు దుర్గేశ్, వీరేశం, బొడ్డు బాబు తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్ అమలులో మాట తప్పిన సీఎం

చందుర్తి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తానని మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తమ పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి ఈర్లపల్లి రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభ పెట్టి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఉద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చూపారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాదని, చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లను అమలు చేస్తేనే అన్నింట్లో బీసీలకు రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. తాజా కులగణన ప్రకారం బీసీలు 1.65 కోటి మంది ఉంటే దామాషా ప్రకారం 51 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతం ఉన్న బీసీలు తాజా సర్వే నాటికి ఇంత భారీగా ఎలా తగ్గారన్నారు.

పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా నీరు



వేములవాడరూరల్: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. పట్టణంలోని మొదటి బైపాస్ ప్రధాన రోడ్డు పక్కన భగీరథ పైప్‌లైన్ లీకేజీతో గత రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు దృష్టిసారించడం లేదు. రోజూ ఈ రోడ్డు పక్క నుంచి సంబంధిత శాఖ అధికారులు వెళ్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా లీకేజీ కాకుండా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తుప్పు పడుతున్నయ్..!

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల ప్రజలసౌకర్యం కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. వీటి నిర్వహణ, వినియోగం లేక తుప్పుపడుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు ప్రతిమ సంస్థ సహకారంతో మండలంలోని కోనరావుపేట, మరిమడ్ల గ్రామాలకు అంబులెన్స్‌లను అందించారు. మంచి ఉద్దేశంతోనే ఇచ్చినా స్థానిక పాలకుల నుంచి సరైన సహకారం లభించకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. గత ఏడాదిగా వాటిని వినియోగించకపోవడంతో వాహనాలు తుప్పు పడుతున్నాయి. అంబులెన్స్‌లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సీఎంకు పూలమొక్క అందజేత


సీఎం రేవంత్‌రెడ్డికి పూలమొక్క ఇస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి విప్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

సిరిసిల్లటౌన్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుల భద్రత, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు తదితరాల్లో కేంద్రం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ఉద్యమాల ద్వారా మాత్రమే సాధించుకోగలుగుతామన్నారు. ఆర్. రవి, సంధుల నరసన్న, మల్లేశం, బాబు, కమలాకర్, శ్రీనివాస్, నరసన్న, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్


మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చందుర్తి: మండలంలోని మల్యాల గ్రామ శివారు మల్లె గుట్ట ప్రాంతం నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గురువారం పట్టుకున్నారు. ఆర్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం ... రామారావుపల్లెకు చెందిన ఓ రైతు గుట్ట ప్రాంతం నుంచి మట్టిని ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడులు చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. మట్టి తరలిస్తున్న రైతుపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సంతోష్


కూర సంతోష్

ముస్తాబాద్: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కూర సంతోష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చందా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గందె రమేశ్, కోశాధికారులుగా పప్పుల శ్రీధర్, బొందుగుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా పప్పుల శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా గందె చంద్రం, కూర భిక్షపతి, సుదర్శన్, సోమరాజు, అమర్ ఎన్నికయ్యారు.

అనాథ ఆశ్రమానికి వృద్ధురాలు

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన కూకట్ల రాజవ్వ (85)కు ఆలనాపాలన చూసేవారు లేకపోవడంతో గురువారం ఓబులాపూర్ అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకుడు గడ్డం తిరుమల శ్రీనివాస్ వారి వృద్ధాశ్రమంలో చేర్పుకున్నారు. కార్యక్రమంలో కూకట్ల తిరుపతి, ఎడమల శ్రీధర్ రెడ్డి, లింగాల జలందర్ పాల్గొన్నారు.

గేదె మృత్యువాత

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండాకు చెందిన గుగులోత్ దర్గరాజ్ అనే రైతుకు చెందిన పాడి గేదె గురువారం తెల్లవారుజామున మృత్యువాతపడింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. రోజూలాగానే గేదెను షెడ్డులో కట్టేసి వెళ్లగా గురువారం ఉదయం తాడు చుట్టుకొని మృత్యువాతపడినట్లు తెలిపాడు. రూ.68వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.





కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో కుక్కల బెడద ఎక్కువైంది. చికెన్ వ్యర్థాలను తింటూ చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కల కారణంగా చిన్నారులు జబ్బుల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
–చేపూరి రాజు, కనగర్తి

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అరీఫ్ పాషా, ఎంపీవో, సెల్ నెం. 9989249855

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మాల మహానాడు నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

తంగళ్లపల్లి: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ జక్కుల యాదగిరి, బొల్ల గణేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్టుపల్లి పరుశరాములు, ఉపాధ్యక్షుడు లింగం శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ నేరటి శ్రీనివాస్, సిరిగిరి మరళి, ఆనందం, బండ రాజు పాల్గొన్నారు.

సన్మానం


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండారపు కృష్ణారెడ్డిని మండలకేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా రెడ్డి సామాజిక వర్గం ఉన్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు గుల్లపల్లి నర్సింహారెడ్డి, జంగిడి సత్తయ్య, బందారపు బాల్‌రెడ్డి, మీసం రాజం, ఎనగందుల నర్సింలు, రాజిరెడ్డి, పిల్లి కిషన్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజరాజేశ్వరుడి కల్యాణం

వేములవాడ: శ్రీ రాజరాజేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం మస్కట్‌లో నిర్వహించనుండగా ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ గురువారం రాత్రి మస్కట్ చేరుకున్నారు. ఆయనకు ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు.

మహిళను బెదిరించిన వ్యక్తికి ఏడాది జైలు

బోయినపల్లి: మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు చంపుతానని బెదిరించిన బోయినపల్లికి చెందిన రాజుకు జడ్జి ఏడాది జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధించినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ గురువారం తెలిపారు. బోయినపల్లికి చెందిన స్వప్న తనపై రాజు అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమె ఇంటికెళ్లి ఆమెను, ఆమె కుటుంబసభ్యులను చంపుతానని బెదిరించినట్లు 2016, జనవరి 4న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు చార్జిషీట్ కోర్టుకు సమర్పించారు. రాజుకు ఏడాది జైలు, రూ.7వేలు జరిమానా విధించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు రాజన్నపేటలో సీసీరోడ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు చెన్ని బాబు, అంతర్పుల గోపాల్, రాములు, రాజేందర్, సత్యనారాయణ, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించి.. పనులు మరిచారు


మోడల్ హౌజ్‌కు భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ (ఫైల్)

వేములవాడరూరల్: నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్న ఉద్దేశంతో భూమిపూజ చేశారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను రూ. 5 లక్షలతో నిర్మించేందుకు మొదటగా గతనెల 18న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా హౌజింగ్ అధికారులు ప్రారంభించారు. ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభించలేదు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులకు మోడల్ హౌజ్‌ను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. అయినా అధికారులు ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. రూ.5 లక్షల్లో ఇల్లు ఎలా నిర్మించుకోవచ్చు అనే దానిపై గృహ నిర్మాణ సంస్థ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ హౌజ్‌ను వేములవాడ మండల పరిషత్ ఆవరణలో ప్రారంభించారు.

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

మండల పరిషత్ ఆవరణలో నిర్మించనున్న మోడల్ హౌజ్ నిర్మాణ పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. గతనెల ఎమ్మెల్యే చేతుల మీదుగా పనులు ప్రారంభించాం. ఇందిరమ్మ సర్వే, ఇతర పనుల ఒత్తిడితో పనులు ప్రారంభించడంలో ఆలస్యం జరిగింది. పనులు ప్రారంభించి 15 రోజుల్లో హౌజ్ నిర్మాణం పూర్తి చేస్తాం.
– చెన్నయ్య, హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్

నియామకపత్రాలు అందజేత

తంగళ్లపల్లి: బీసీ సాధికారిక సంఘం మండల అధ్యక్షుడిగా కందుకూరి రామాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండి దేవేందర్ యాదవ్‌ను నియమిస్తూ గురువారం జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ నియామక పత్రాలు అందజేశారు.